

విగ్రహాలను ఉత్సాహంగా తరలిస్తున్న యువకులు


ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ


చెరుకు గడలతో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దృశ్యం


ఉయ్యాలవాడలో మట్టి గణపతులను అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్

పండగొచ్చింది.. సందడి మొదలైంది

- మొదలైన వినాయక చవితి సందడి
- వాడవాడలా ఉత్సవాలకు ఏర్పాట్లు
- గ్రామాలకు వాహనాలపై తరలిన గణనాథులు



ఆళ్లగడ్డలో క్రేన్ సాయంతో విగ్రహాన్ని వాహనంలోకి చేరుస్తున్న దృశ్యం, నంద్యాలలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

ఆళ్లగడ్డ: గణపతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రాలు, ఆళ్లగడ్డ పట్టణంలోని కూడళ్లలో యువత మండపాల ఏర్పాటు, విగ్రహాలు కొనుగోలు చేసి కేంద్రాలకు తరలించడం, పూజా సామగ్రి కొనుగోళ్లు చేస్తున్నారు. ఆళ్లగడ్డలో సుమారు 250 పెద్దవి, 200 చిన్న విగ్రహాలు అమ్ముడుపోయినట్లు తెలిసింది.

రుద్రవరం: మండలంలో వినాయక చవితి సంబరాలు మొదలయ్యాయి.21 గ్రామ పంచాయతీల్లో వినాయకులను కొలువు దీర్చేందుకు మండపాలను సిద్ధం చేశారు.

ఉయ్యాలవాడ : గణేష్ ఉత్సవాలను జరుపుకునేందుకు గ్రామాల్లో నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. గణనాథులు పట్టణ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు చేరుకుంటున్నారు. ఉయ్యాలవాడలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను ఖాతాదారులకు ఉచితంగా అందజేశారు.

శిరివెళ్ల: మండలంలో 25 వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని ఎస్‌ఐ సురేష్ ఆదివారం తెలిపారు. వేడుకల సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశామన్నారు.

నంద్యాల(వ్యవసాయం): సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు కూడళ్లు, వీధులు, గృహాల్లో ఉత్సవాలను నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం విగ్రహాల కొనుగోళ్లు జోరుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో తరలిస్తుండటంతో పట్టణ వీధులు కిటకిటలాడాయి. నంద్యాల నియోజకవర్గ పరిధిలో ఏటా 600 వరకు విగ్రహాలను నెలకొల్పేవారు. ఈ ఏడాది 800కు పైగా ఏర్పాటు చేయనున్నారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీఇక్షుదండ (చెరకుగడలతో) మహా గణపతి, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో బాలాజీ స్వరూప గరుడ వాహన మహాగణపతిని ఏర్పాటు చేయనున్నారు. భక్తులు ఆదివారం ఉదయం నుంచే జిల్లెడు, శీతాఫలం, వెలక్కాయ, తంగెడాకులు, ఉత్తరేణి, గరిక, అరిటాకు, మొక్కజొన్న కంకులు, చెరకు గెడలు, అరటి బోదెలు.. తదితర కొనుగోలు చేయడానికి తరలి రావడంతో మార్కెట్ కిటకిటలాడింది. పట్టణంలోని పద్మావతినగర్‌లో వ్యాపారులు గణేష్ ఉత్సవ విగ్రహాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. విగ్రహాల ఎత్తు, ప్రత్యేకతను బట్టి రూ.15వేల నుంచి రూ.50వేల వరకు విక్రయించారు.

దొర్నిపాడు: సోమవారం వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం విగ్రహాల తరలింపు, పూజా సామగ్రి కొనుగోలుతో మార్కెట్లు కిటకిటలాడాయి. ఇప్పటి వరకు 16 విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతులు తీసుకున్నారని ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను రోటరీ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రాజు, ప్రసాద్, మేరి, రమాదేవి, పోతులూరు, పద్మావతి, వెంకటసుబ్బారెడ్డి, ఆదినారాయణను క్లబ్ అధ్యక్షుడు దస్తగిరి సన్మానించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడులు కోరారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల అనుచిత వ్యాఖ్యలు మాట్లాడటం ప్రజా ప్రతినిధులకు తగదన్నారు. పీఆర్సీలు, డీఏలు సకాలంలో చెల్లించాలన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారి అభిషేకాలు, హారతులు ఇచ్చి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు అమ్మవారికి చీర,సారె, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శనగ బద్దపై త్రిముఖ గణపతి

నంద్యాల(అర్బన్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్ర కారుడు చింతలపల్లె కోటేష్ శనగ బద్దపై సూక్ష్మ త్రిముఖ గణపతి చిత్రాన్ని గీశారు. మైక్రో బ్రష్‌తో మూడు ముఖాలు ఉన్న గణనాథుడి సూక్ష్మ చిత్రంలో ఒక చేతితో భక్తులను దీవిస్తున్నట్లు, మరో చేతిలో ఉండ్రాళ్లు ఉన్నట్లు చిత్రించారు.


శనగ బద్దపై వేసిన వినాయక త్రిముఖ చిత్రం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: రుద్రవరం మండలంలోని టి.లింగందిన్నెకు చెందిన పది కుటుంబాలు ఆదివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కురువ వెంకటరమణయ్య, , బైసాని సుబ్బారావు, కురువ వెంకటకృష్ణుడు, కురువ వెంకటేశ్వర్లు, కురువ పెద్ద నరసింహుడు, గొడుగు లింగయ్య, జిడి ఓబులేసు తదితరులకు పార్టీ కుండువా కప్పి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆహ్వానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై పార్టీలోకి చేరినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, హరినారాయణ పాల్గొన్నారు.

22న ప్రత్యేక వైద్య కేంద్రాలు

నంద్యాలటౌన్: ఈనెల 22వ తేదీన వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విక్టోరియా రీడింగ్ రూం , గాంధీచౌక్, చిన్నచెరువు ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 24 మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. అలాగే గాంధీ చౌక్, చిన్నకెరువు ప్రాంతాల్లో కూడా వైద్య సిబ్బందిని ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మండపాలు ఏర్పాటు చేయొద్దు

నంద్యాల(అర్బన్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద గణేష్ మండపాలను ఏర్పాటు చేయొద్దని, విద్యుత్ స్తంభాలను మండపాల సపోర్టు కోసం వాడవద్దని డి1 ఏఈ నాగరాజు సూచించారు. వినాయక పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా వైర్లను వాడాలన్నారు. సీరియల్ లైట్ల కనెక్షన్ల కోసం గుండు సూదులు వినియోగించొద్దని చెప్పారు.

వ్యక్తిపై దాడి

దొర్నిపాడు: మండలంలోని అర్జునాపురం గ్రామంలో అప్పు ఉన్నాడనే కారణంతో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. విష్ణువర్దన్, తిమ్మయ్య, ఓబుళమ్మ వద్ద..రామసుబ్బారెడ్డి అనే వ్యక్తి రూ.20వేలు అప్పు తీసుకున్నాడు. తమ అప్పు చెల్లించాలని అడిగినందుకు తాను ఎవరికీ బాకీ లేనని రామసుబ్బారెడ్డి చెప్పడంతో ఆ ముగ్గురూ ఆయనపై దాడి చేశారు.బాధితుడి ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

వ్యక్తికి గాయాలు

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లెకు చెందిన రాధాకృష్ణ అనే వ్యక్తి మోటార్ సైకిల్ మీద నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం వ్యక్తిగత పనుల మీద నంద్యాల వైపు వెళ్లి ఇంటికి తిరిగొచ్చే సమయంలో చిన్నకంబలూరు మెట్ట సమీపంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడ్డాడు. రుద్రవరం ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి నంద్యాలకు తరలించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

నంద్యాల(న్యూటౌన్):: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేసేందుకు నాయకులు సిద్ధంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు


అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె, ముత్యాలపాడు మజరా గ్రామలైన చక్రవర్తులపల్లో, ముత్యాలపాడు తండా గ్రామాల్లో నాలుగు రోజుల పాటు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వ్యక్తమైన సమస్యల పరిష్కారం నిమిత్తం ఆదివారం ముత్యాలపాడు సచివాలయం–1లో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెండు సచివాలయాలకు రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు. వీటిలో ముత్యాలపాడులో రోడ్లు, డ్రైనేజీలకు రూ.20 లక్షలు, ఎం.తండాకు రూ.8 లక్షలు రోడ్లు, డ్రైనేజీకి, తోడేండ్లపల్లె, చక్రవర్తుల పల్లె గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ నిధులకు అదనంగా ఉపాధి హామీ పథకం కింద మరో రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అలాగే ముత్యాలపాడులో 36 మంది ఇంటి స్థలాలకు దరఖాస్తు చేశారని, వీరికి అసెంబ్లీ సమావేశాలు పూర్తవ్వగానే పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే మరో 18 మంది పింఛన్లకు దరఖాస్తు చేశారని వారికి జనవరి నెలలో మంజూరయ్యేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సర్పంచ్‌లు బుక్కే శంకరమ్మబాయ్, రామిశెట్టి గోవిందయ్య, ఉపసర్పంచ్ ఓబులేసు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరాముడు, రెహమాన్, సుబ్బరాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మిర్చి పంట తొలగింపు


ఆర్.నాగులవరం వద్ద మిర్చి పంటను దున్నేస్తున్న దృశ్యం

రుద్రవరం: మిర్చి పంట రైతుకు కలిసి రాలేదు. లక్షలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టినా ఫలితం లేక పోయింది. వాతావరణం అనుకూలించక పోవడం, వైరస్ సోకడంతో మొక్కల్లో ఎదుగుదల లేక సరైన దిగుబడులు రాలేదు. అయినప్పటికీ రైతు ఆశతో ఎదురు చూశారు. నెలలు గడిచినప్పటికీ ఎకరానికి నాలుగు ఐదు బస్తాలు (50కేజీలు) మాత్రమే దిగుబడులు వచ్చాయి. వాటికి వచ్చిన సొమ్ము కూలీలు,మందులు పిచికారికే సరిపోయింది. దీంతో చేసేదిలేక రైతులు ఒక్కొక్కరుగా పంటను ట్రాక్టర్ల ద్వారా దున్నేయసాగారు. మండల కేంద్రంతో పాటు రెడ్డిపల్లె, తువ్వపల్లె, టీ.లింగదిన్నె, ఆర్.నాగులవరం,నర్సాపురం,ఆలమూరు తదితర గ్రామాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్‌కు కాస్త ముందే దాదాపు 2వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. ఇప్పటికే సగం మంది రైతులు మిర్చి పంటను దున్నేశారు.మిగిలిన వారు అదే బాటలో ఉన్నారు. ఆదివారం ఆర్.నాగులవరం వద్ద ఖాసిం అనే రైతు మిర్చి పంటను ట్రాక్టర్ సాయంతో దున్నేశాడు.

శాస్త్రవేత్తలకు సన్మానం


శాస్త్రవేత్తలను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజ బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం చంద్రయాన్-3 విజయవంతం చేసిన నంద్యాల జిల్లా శాస్త్రవేత్తలను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం చేసిన శాస్త్రవేత్తల గొప్పతనం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశం గర్వించే ప్రయోగాలు చేసి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. చంద్రయాన్-3లో పాల్గొన్న నంద్యాల జిల్లాకు చెందిన కాకరవాడ చంద్రశేఖర్‌రెడ్డి, నంద్యాల గిరీష్‌కుమార్, నంద్యాల కిరణ్‌కుమార్, ప్యాపిలి లలిత్‌కుమార్, ఆళ్లగడ్డకు మహేంద్రనాథ్‌ను ఊరేగింపుగా తీసుకొచ్చి సత్కరించారు.

వైభవంగా విశ్వకర్మ జయంతి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పెద్దబండ వీధిలో వెలసిన శ్రీగోవిందమాంబ వీరబ్రహ్మేంద్ర దేవస్థానంలో పట్టణ విశ్వకర్మ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, అంఖడ జ్యోతి ప్రజ్వలన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. అలాగే విశ్వనగర్‌లోని గాయత్రి విశ్వకర్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు సూర్యప్రకాష్ ఆచారి, విశ్వరూపాచారి, విజయలక్ష్మి, బీజేపీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల ఉపాధ్యాయులకు పురస్కారాలు


ఉపాధ్యాయులతో డాక్టర్ శామ్యూల్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులకు గురుస్పందన పురస్కారాలు లభించాయి. అనంతపురం పట్టణంలోని ఎస్‌కే మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాతి నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై సీమ స్థాయి సదస్సు నిర్వహించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, మహబూబ్‌బాషా, వెంకటేశ్వర్లు, శేషఫణి, కన్నయ్య పాల్గొని ప్రసంగించారు. ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్‌రెడ్డి ఆధ్వర్యంలో గురుస్పందన పురస్కారాలతో వారిని సత్కరించారు.